W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

16-10-2025

భద్రాద్రి కొత్తగూడెం



04

## ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా రికార్డు స్థాయిలో వానాకాలం పంట కొనుగోలుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి హైదరాబాద్ నుంచి వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.



# వైరా వేర్ హౌస్‌లో రైస్ రికార్డు దందా!

అక్రమాలకు మెయిన్‌డోర్

- బియ్యం బస్తాల వెనుక కోట్ల రూపాయల ఆట!
- వైరా గోదాముల్లో 'వైట్నర్' మార్క్ అవినీతి!
- జీఎం ఐదు గంటల సుదీర్ఘ విచారణ
- పీడీఎస్ రైస్ మాఫియా.. తిరిగి మిల్లర్లకు అమ్మకాలపై బలపడుతున్న అనుమానాలు!
- రికార్డుల్లో గోల్‌మాల్, తప్పుడు ఎంట్రీలు .
- రాష్ట్ర స్థాయి విచారణకు చైర్మన్ రాయల నాగేశ్వరరావు సీరియస్!
- మహా పత్రిక కథనానికి స్పందన

ఖమ్మం బ్యూరో మహా

**మహా ఎఫెక్ట్**

ప్రజల కోసం ప్రభుత్వం ఉద్దేశించిన ప్రతి గింజకీ భద్రత కల్పించాల్సిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్)కి చెందిన వేర్‌హౌసింగ్ గోదాములు ఇప్పుడు అక్రమాలకు, అవినీతికి అడ్డాగా మారాయనేది వైరా ఘటనతో తేటతెల్లమైంది. గత కొన్ని నెలలుగా ఉధృతంగా సాగుతున్న అవినీతి గోల, గోదాముల లోపల జరుగుతున్న కోట్ల రూపాయల ఆట , ఇప్పుడు రాష్ట్ర వేర్‌హౌసింగ్ వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన లోపాలను, మాఫియా పట్టును బహిరంగ మైదానానికి లాగింది. పేదలకు సరఫరా చేయాల్సిన బియ్యం బస్తాలు తిరిగి అక్రమంగా మిల్లర్లకు అమ్ముడవుతున్నాయనే అనుమానాలు, ఈ దందాలో ఉన్నతాధికారుల నుంచి కాంట్రాక్ట్ సిబ్బంది వరకు భాగస్వామ్యం ఉందనే ఆరోపణలు... ఈ మొత్తం వ్యవహారం వైరా ప్రజలను, జిల్లా పరిపాలన వ్యవస్థను కుదిపేశాయి. మహా పత్రిక'లో ప్రచురించబడిన దర్యాప్తు కథనమే. ఆ కథనం అందించిన వివరాలు, ఆధారాలు రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ అగ్ర నాయకత్వం దృష్టికి చేరాయి. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న చైర్మన్ రాయల నాగేశ్వరరావు తక్షణమే స్పందించి, ఎటువంటి జాప్యం లేకుండా సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ ఆదేశాలు కార్పొరేషన్‌లో కలకలం రేపాయి.



02

## ఆశ్రమ వర్కర్ల ఆర్తనాదాలు పట్టవా?

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో దినసరి వర్కర్లుగా గత కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతినెల సక్రమంగా జీతాలు వచ్చినా రాక పోయినా తాము నమ్ముకున్న పనిని శక్తివంచన లేకుండా చేసుకుంటూ ,ఇటు అధికారులకు ,ప్రభుత్వానికి ,విద్యార్థులకు ఎటువంటి అవరోధాలు కలగకుండా ఇప్పటి వరకు రోజులు గడిపారు.



03

## చివరి మజిలీకి తప్పని తిప్పలు

గ్రామాలలో గుంట జాగ లేని నిరుపేదలు మరణిస్తే వారి చివరి మజిలీకి తిప్పలు తప్పడం లేదు. అంత్య క్రియలు నిర్వహిం చేందుకు ఆరడుగుల నేల దొరకక నిరుపేదలు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి వైకుంఠ ధామాలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా 24 గ్రామపం చాయతీ లలో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం ముందుచూపు లేకుండా ఎక్కడపడితే అక్కడ స్మశాన వాటికల నిర్మాణాలు పూర్తి చేశారు.

మహా పత్రిక
ANN తెలుగు



## రోడ్లపై వంటావార్పు ...

ఇదే విషయమై గత నెలలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ప్రక్కనే గిరిజన వర్కర్లు వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.

## ఐటిడిఏ కార్యాలయం ముట్టడి..

సూర్యపేట ,ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ని గిరిజన ఆశ్రమ పాఠశాలలు ,వసతి గృహాలలో పనిచేసే వర్కర్లందరూ ,దాదాపుగా 500 మందితో భద్రాచలంలోని ఐటిడిఏ ఆఫీస్ ను ముట్టడించారు. మూడురోజులపాటు అక్కడే ఉంటూ తమతోపాటే వంటావార్పు చేపట్టారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఐనప్పటికీ ఐటిడిఏ అధికారులు మాత్రం స్పందించడం లేదు.

# ఆశ్రమ వర్కర్ల ఆర్తనాదాలు పట్టవా?

మహా

### ముప్పైఐదు రోజులు గా నిరసనలు , విధులకు గైర్హాజరు

- ఆశ్రమ హాస్టళ్లలో విద్యార్థుల కు తలెత్తిన భోజన సమస్యలు
- సూర్యపేట ,ఖమ్మం ,భద్రాద్రి జిల్లాల నుండి ఐటిడిఏ పి.వో కార్యాలయం ముట్టడి
- న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని దినసరి వర్కర్ల ఆందోళన
- వంటావార్పు ,ర్యాలీ లు , నిర్బంధాలతో అధికారులకు హెచ్చరిక

గిరిజన ఆశ్రమ పాఠశాల లు ,వసతి గృహాలలో దినసరి వర్కర్లుగా గత కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతినెల సక్రమంగా జీతాలు వచ్చినా రాక పోయినా తాము నమ్ముకున్న పనిని శక్తివంచన లేకుండా చేసుకుంటూ ,ఇటు అధికారులకు ,ప్రభుత్వానికి ,విద్యార్థులకు ఎటువంటి అవరోధాలు కలగకుండా ఇప్పటి వరకు రోజులు గడిపారు. ఎంతకాలం ఇలా ... చాలీ చాలని జీతాలు ఒక వైపు ,అవికూడా ప్రతినెలా అందక కుటుంబ ఆర్థిక ఇబ్బందులు మరొక వైపు. ఇంతలోనే ఐటిడిఏ పి.వో నుండి జి.వో నంబర్ 64 ని అనుసరిస్తూ సగం జీతాలు (నెలసరి వేతనం లో సగభాగం ) చెల్లిస్తామంటూ వచ్చిన ఆర్డర్లు... అన్నీ సమస్యలు కలిపి దినసరి వర్కర్లను రోడ్డెక్కాల చేసాయి. అప్పటి వరకు ఎప్పుడో ఒకప్పడు ,ముందుగానో వెనకో తమ జీతాలు వస్తాయి లే అని ఎదురు చూసే ఆశలు నిరాశలయ్యాయి. గత ముప్పై రోజులు గా మండలంలోని అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాల లు ,వసతి గృహాలలో తమ విధులను నిరాకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా దినసరి వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని నిరసన బాట పట్టారు. ఇంకేముంది నాటి నుండి నేటి వరకు వసతి గృహాలు ,ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులే వంట మాష్టార్లుగా అవతారం ఎత్తాల్సిన పరిస్థితి నెలకొంది.

## దినసరి వర్కర్లు చేసిన తప్పేంటి

ఏనాటికైనా తమ ఉద్యోగాలకు భద్రత ఉంటుందని ,పర్మినెంట్ గా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు వస్తుందని ఆశించిన వర్కర్లను ప్రభుత్వం నేడు చిన్నచూపు చూస్తుంది. తమ జీతాలు ఇప్పటి వరకు సీనియార్టీ ప్రకారంగా 20 నుండి 26 వేల వరకు వస్తుంటే వాటిని రెగ్యులర్ గా ప్రతినెలా అందించే లా ప్రభుత్వం కృషి చేయాలని కోరినందుకు గాను , అసలు జీతాలే సగం ఇస్తామని , మిమ్మల్ని రోజువారీ వర్కర్లుగా ఎవరు నియమించారంటూ అధికారులు మట్లాడి తమ మనోభావాలు కించపరిచారంటూ వర్కర్లు ఆవేదన చెందారు. క్రొత్తగా జి.వో నంబర్ 64 తీసుకు వచ్చి తమ జీవితాలను దుర్భరస్థితి కి చేర్చారంటూ మనోవేధన కు గురయ్యారు. గత ప్రభుత్వం లో కూడా దాదాపుగా 60రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టినా కూడా తమ జీతాలను కుదించలేదని , నేడు ఈ పాలకులు నియంతలాగా వ్యవహరిస్తూ అసలు జీతం కంటే తక్కువగా జీతం ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు.



## న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

212 జి.వోని సవరించి ,2014 నాటికి 5సంవత్సరాల సర్వీస్ కలిగి న వర్కర్ల ను పర్మినెంట్ చేయాలి. టైమ్ స్కేల్ అమలు చేస్తూనే , గత సమ్మెకాలంలో జీతాలను అందించాలి. తమ కు ప్రతినెలా వచ్చే వేతనాలు మరియు పెండింగ్ వేతనాలు ట్రెజరీ ద్వారా అందించేలా చర్యలు చేపట్టాలి. ప్రజా పాలన ద్వారా అందిస్తున్న క్రొత్త మెనూ ప్రకారం , కార్మికుల ను కూడా నియమించాలి. దినసరి వర్కర్ల ను రెగ్యులరైజ్ చేస్తూ కార్మికచట్టం వర్తించేలా కార్మికులుగా ప్రభుత్వం చేత గుర్తింపు ఇవ్వాలి. హాస్టల్ విద్యార్థుల తో పాటు గా వర్కర్ల కు రెండుజతల యూనిఫామ్ లు ,గుర్తింపు కార్డు అందించాలి. విధులలో ప్రమాదం సంభవించినప్పుడు ప్రమాద భీమా అమలు చేయాలి. మరణించిన వారి కుటుంబ సభ్యులను వర్కర్లుగా నియమించుకోవాలి. మరణించిన వారి కుటుంబానికి 10లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలి.మరీ ముఖ్యంగా ప్రభుత్వ సెలవుదినాలలో కూడా వేతనం జమ చేసి ఫిక్స్ డ్ జీతం ట్రెజరీ ద్వారా చెల్లించాలి.వర్కర్ల కు రిటైర్మెంట్ కాలం ప్రకటించి ,రిటైర్మెంట్ తర్వాత కూడా ప్రభుత్వ ఉద్యోగి లాగానే ప్రతినెలా సగం జీతం అందించాలి. రిటైర్మెంట్ ఫండ్స్ జమ చేయాలని వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు.





# రైతులు విద్యుత్ మీటర్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలి



**దమ్మపేట , మహా :** వ్యవసాయ క్షేత్రాలలో విద్యుత్ ఉపయోగించే రైతు సోదరులు తమ విద్యుత్ మీటర్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని అశ్వారావుపేట విద్యుత్ శాఖ ఏ.డి. నందయ్య పేర్కొన్నారు. మండలంలోని పార్కలగండిలో మంగళవారం విద్యుత్ శాఖ ఆద్వర్యంలో నిర్వహించిన రైతు పొలంబాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆటో స్టాటర్ల వినియోగం తగ్గించాలని ,విద్యుత్ ను అవసరం మేరకే వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏ.డి.ఈ వెంకటరత్నం ,ఏఇ సాయికిరణ్ , సబ్ ఏఇ వెంకటేశ్వరరావు ,మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు పాల్గొన్నారు.

## దొంగతనానికి 6 నెలల జైలు శిక్ష

**మణుగూరు, మహా:** మణుగూరు పట్టణంలో జరిగిన దొంగతన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి బుధవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం.. కే.సమ్మయ్య 2017 మార్చి 8న మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ, తాము ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు తలుపులు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్ దొంగిలించారని తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన అప్పటి ఏఎస్ఐ జి.రాంబాబు ప్రాథమిక దర్యాప్తు జరిపి కేసును ఎస్ఐ కుమార్‌స్వామికి అప్పగించారు. తదుపరి విచారణలో పోలీసులు నిందితులైన శివరాత్రి సంతోష్, బత్తుల నరసింహారావులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ పూర్తిచేసిన ఎస్ఐ కుమార్‌స్వామి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా ఎనిమిది మంది సాక్షులను విచారించిన కోర్టు, నిందితుడు బత్తుల నరసింహారావుపై నేరం రుజువైందని తేల్చి ఆరు నెలల సాదారణ జైలు శిక్ష విధించింది. మొదటి నిందితుడు శివరాత్రి సంతోష్ విచారణలో ఉండగానే మరణించినట్లు కోర్టు నమోదు చేసింది. ఈ కేసులో దొంగతనానికి పాల్పడిన వస్తువులను తన వద్ద ఉంచుకున్నందుకు బత్తుల నరసింహారావుకు కోర్టు శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ లావణ్య వాదించగా, కోర్టు కానిస్టేబుల్ బుచ్చిబాబు విచారణలో సహకరించారు.

# బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు చేయాలంటూ భారీ ప్రదర్శన

- అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన..
- బంద్‌కు సిపిఐ మద్దతు



**మణుగూరు, మహా:** బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం మణుగూరులో భారీ ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుండి నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరి జై బీసీ–జై జై బీసీ అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ సెంటర్ వరకు చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి, విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి మాట్లాడుతూ.. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్ తీర్మానం కేంద్రం వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉందని, దీనిపై చర్యలు తీసుకోవడంలో కేంద్రం చిత్తశుద్ధి చూపలేదని అన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కాలంటే రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు కావాలని పేర్కొన్నారు. కొందరు దురుద్దేశంతో కోర్టులను ఆశ్రయించి రిజర్వేషన్ అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రేపు 18వ తేదీ బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపుకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ, మండల కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహనరావు, ఎడారి రమేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, మహిళా సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు బోలగాని సమ్మక్క, సుజాత, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్‌కే సర్వర్, మంగి వీరయ్య, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, నాయకులు కొత్తపల్లి సీతారాములు, వేర్పుల నరేష్, నోముల రవి, ఆధరల రాములు, పులిగల రమేష్, మాజీ ఎంపీటీసీ పాయం లక్ష్మయ్య, కన్నెపోయిన ప్రసాద్, ఎస్‌డి ఉమర్, వెంకటేశ్వర్లు, బోసెట్టి సంపత్, కోళ్ల నరసింహారావు, చక్రపాణి, యాకూబ్, డొంక రాములు, రంగు ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చివరి మజిలీకి తప్పని తిప్పలు



**జూలూరుపాడు, అక్టోబర్ 15, (మహా):** గ్రామాలలో గుంట జాగ లేని నిరుపేదలు మరణిస్తే వారి చివరి మజిలీకి తిప్పలు తప్పడం లేదు. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆరడుగుల నేల దొరకక నిరుపేదలు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి వైకుంఠ ధామాలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా 24 గ్రామపం చాయతీ లలో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం ముందుచూపు లేకుండా ఎక్కడపడితే అక్కడ స్మశాన వాటికల నిర్మాణాలు పూర్తి చేశారు. “రాజుల సొమ్ము రాళ్లపాలు” అన్నచందంగా అవి ఇప్పుడు చాలా గ్రామాలలో ఎవరికి ఉపయోగపడకుండా శిధిలమవు తున్నాయి. ముఖ్యంగా కొన్ని వైకుంఠధామాలు చెరువులలో కట్టడం వలన నేడు నీళ్లలో మునిగి దర్శనమిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో వర్షాకాలం అనారోగ్య కారణాలతో చనిపోయిన నిరుపేదల అంత్యక్రియలు నిర్వహించేందుకు కనీసం ఆరడుగుల జాగ దొరకక నాన్న అవస్థలు పడుతున్నారు. మండల పరిధి నర్సాపురంలో ఒక మహిళ చనిపోతే మంగళవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యులు ఆరడుగుల జాగ కోసం పడరాని పాట్లు పడ్డ సంఘటన గ్రామ ప్రజల హృదయాలను కదిలించింది. ఉన్న స్మశాన వాటిక నీట మునిగి మృతదేహాల పేదరికాన్ని ఎక్కిరిస్తోంది. మండలంలో వైకుంట దామాల మెయింటెనెన్స్ ఎవరూ పట్టించుకోకపోవడం వలన నీట మునిగి కొన్ని, కంప చెట్లు మొలసి కొన్ని దర్శనమిస్తున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనాన్ని ఎందుకు పనికి రాకుండా వృధా చేశారం టూ గ్రామాలలో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు వైకుంఠ ధామాల బాగోగులపై దృష్టి సారించి భూమిలేని నిరుపేదల అంతిమ సంస్కారాలకు అనుకూలంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

## స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం





**అశ్వారావుపేట,మహా:** అశ్వారావుపేట మండలంలోని వినాయకాపురం గ్రామం ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వ నిధులతో వేసిన సిమెంట్ రోడ్లు కొన్నేళ్లు కూడా మన్నక ముందే పగుళ్లు పడి గోతులు ఏర్పడి నడవలేని పరిస్థితి నెలకొంది. రోడ్ల పక్కన ఉన్న డ్రైనేజీలు మూసుకుపోయి మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వ్యాపించి ప్రజల జీవనాన్ని కష్టతరం చేస్తోంది. సాధారణం గా ఒక సిమెంట్ రోడ్డు 10–15 సంవత్స రాలు మన్నాలి. కానీ వినాయకాపురంలో వేసిన రోడ్లు నెలల వ్యవధిలోనే కుప్పకూలడం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నాసిరకం పనుల నిదర్శనం అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పన్నుల రూపంలో మనం ఇచ్చిన డబ్బులు వృథా అవుతున్నాయి. రూపాయి పని కూడా సగం స్థాయిలో చేయడం లేదు. అధికారులు కూడా చూడనట్టు వ్యవహరిస్తున్నారు అని వారు మండిపడుతున్నారు. గ్రామంలో గందరగోళం అంతా రోడ్లకే పరిమితం కాలేదు. డ్రైనేజీ వ్యవస్థ కూడా పూర్తిగా దెబ్బతింది. నీరు సరిగా పారక మురుగు నిల్వ అవ్వడంతో దుర్వాసన, దోమల విపత్తు, ఆరోగ్య సమస్యలు రోజువారీ సమస్యలుగా మారాయి. ఇలాగే కొనసాగితే రాబోయే స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం. అధికారులకూ, కాంట్రాక్టర్లకూ ఇక మినహాయింపు లేదు అని గ్రామస్తులు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు.

## చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు



**ఖమ్మం,మహా:** జిల్లాలో రైతులు పండించిన చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి బుధవారం వానాకాలం పంటల కనీస మద్దతు ధరపై గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన పంటలకు సంబంధించిన మద్దతు ధరలను ప్రకటించిందని అన్నారు. ప్రతి క్వింటాల్ గ్రేడ్ ఏ రకం ధాన్యానికి 2389 రూపాయలతో పాటు 500 బోనస్, సాధారణ రకం ధాన్యానికి 2369, పత్తి (పొడవు గింజ) 8110, పత్తి (మధ్యస్థ గింజ) 7710 రూపాయలు, మొక్కజొన్నకు 2400 రూపాయలు, కందులకు 8 వేలు, పెసలకు 8768, వేరుశనగ కాయలకు 7263, మినుములు 7800 రూపాయలకు, పొద్దు తిరుగుడుకు 7721, సోయాబీన్ కు 5328, నువ్వులకు 9846, సజ్జలు 2775, రాగులకు 4886 రూపాయలు మద్దతు ధర నిర్ణయించారని అన్నారు. రైతులు స్థానిక మార్కెట్ యార్డులో తమ పంటను కనీస మద్దతు ధరకు విక్రయించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని, సన్న రకం ధాన్యం కు రాష్ట్ర ప్రభుత్వం 500 రూపాయల బోనస్ కూడా అందిస్తుందని అన్నారు.

## వ్యాధి నిరోధకటీకాల తనిఖీ



**మధిర మహా:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బానోత్ కళావతి భాయ్, జిల్లా సార్వత్రిక వ్యాది నిరోధక టీకాల నిర్వహణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చంద్ నాయక్ అదేశాలమేరకు జిల్లా వాక్సిన్ లాజిస్టిక్ మేనేజర్ (డివి ఎమ్ ఎల్ )చింతల వెంకట రమణ బుధవారం మండల పరిధిలొని పీహెచ్సి దెందుకూరు పరిధిలో దెందుకూరు మడుపల్లి మధిర పిపి యూనిట్ పరిధిలో జరిగే నెలవారి (ప్రతి బుధవారం ప్రతి శనివారం )సంపూర్ణ వ్యాది నిరోధక టీకాలు కార్యక్రమంను ఆయన తనిఖీ చేసి టీకాలు నిల్వ పద్ధతి సరైన టెంపరెచర్ గురించి పారా మెడికల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలంలోని జక్కేపల్లి, జక్కేపల్లి కాలనీలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కూసుమంచి మండలం పశు వైద్యాధికారులు బుధవారం ప్రారంభించారు. అందులో భాగంగా 61 తెల్ల పశువులకు, 586 నల్ల పశువులకు గాలికుంటు టీకాలు వేయడం జరిగింది. మొత్తంగా 55 మంది పాడి రైతులకు లబ్ధిచేకూరందని కూసుమంచి మండలం పశువైద్యాధికారి డాక్టర్ ఆర్.నీలకాంత్ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని తెలిపారు. జక్కేపల్లి జేఈవో కె. స్వరూప, పాలేరు ఎల్ఎస్ఏ పి.శ్రీనివాసరావు, ఈశ్వరమాదారం ఎల్ఎస్ఏ ఎండీ. హమీద్ పాషా, కూసుమంచి ఓఎస్ స్వరూప, సీహెచ్. మాధవ్, మున్నగు పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రులు పి. గోపి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై దశలవారీగా పోరాటాలు




**కొత్తగూడెం టౌన్, మహా:** విద్యారంగ సమస్యలపై విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు మండల జిల్లా రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి పి.చేతన్ పిలుపునిచ్చారు. జిల్లా ఐఎఫ్టియు కార్యాలయం నందు పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణ నాయకులు సురేందర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. అనంతరం చేతన్ ప్రసంగిస్తూ ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి డి ఎస్ యు)విద్యార్థి సమస్యలపై విద్యారంగ సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్వహించి విజయం సాధించిందని విద్యార్థుల హక్కుల గురించి కొట్లాడి సాధించి పెట్టడంలో ప్రధాన పాత్ర పోషించిందన్నారు.

# ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

## మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు

### 48 నుంచి 72 గంటల వ్యవధిలో రైతుల ఖాతాలో ధాన్యం సొమ్ము జమ

- 8342 కొనుగోలు కేంద్రాల ద్వారా 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- ప్రణాళికాబద్ధంగా వరి కోతలు జరిగేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి
- ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన మంత్రులు

**ఖమ్మం,మహా:** స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా రికార్డు స్థాయిలో వానాకాలం పంట కొనుగోలుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి హైదరాబాద్ నుంచి వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశ చరిత్రలో అత్యధికంగా వరి పంట సాగు విస్తీర్ణం ప్రస్తుతం మన తెలంగాణ రాష్ట్రంలో జరుగుతుందని అన్నారు. రాబోయే వానా కాలం అత్యధికంగా పంట కొనుగోలు తెలంగాణ రాష్ట్రం చేయబోతుందని, దీనికి అవసరమైన ఏర్పాట్లు కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టాలని అన్నారు. గతంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ధాన్యం రవాణా కాంట్రాక్ట్ ఖరారు చేసే ముందు సరిపడ వాహనాలు సరఫరా చేసేందుకు అర్హత ఉందో లేదో ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని మంత్రి సూచించారు. జిల్లాలో వరి కోతలు ప్రణాళికాబద్ధంగా జరిగేలా కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు, గన్నిబ్యాగులు, వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామాగ్రి సిద్ధం చేసుకోవాలని, కొనుగోలు సిబ్బందికి అవసరమైన మేర శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదురు చూసే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని



అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ట్యాబ్ ఎంట్రీ జరిగేలా సిబ్బంది నియమించుకోవాలని, 2025 వానాకాలం సీజన్ నందు ధాన్యం డబ్బులు 48 నుంచి 72 గంటలలోగా రైతుల ఖాతాలలో జమ చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. ఖమ్మం జిల్లాలోని 5 వ్యవసాయ మార్కెట్ యార్డుల వద్ద డ్రైయర్ లను ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న మ్యానువల్ ప్యాడీ క్లీనర్లను కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలని అన్నారు. టార్పాలిన్ కవర్లు ప్రతి కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో పెట్టాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.



### మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు బాగా జరుగుతుందని ప్రభుత్వానికి మంచి పేరు ఉందని, గత రెండు సంవత్సరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత సీజన్ మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు చేసేందుకు కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను వరి కోతల కంటే ముందుగానే ప్రారంభించాలని అన్నారు. దీపావళి తర్వాత వరి కోతలు వేగం కానున్న నేపథ్యంలో జిల్లా గన్ని బ్యాగులు, ధాన్యం రవాణా ఏర్పాట్లు, ధాన్యం సెంటర్ లలో ఇన్ ఫ్రా సౌకర్యాల కల్పన చర్యలు తీసుకోవాలని అన్నారు. క్రమ పద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చేలా చూడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు.

# మాదక ద్రవ్య రహిత జిల్లాయే లక్ష్యం

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు "చైతన్యం" పేరుతో పలు కార్యక్రమాలు.. భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి బ్యూరో, మహా:** జిల్లాలో మాదక ద్రవ్యాల సమూల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు భాధ్యతను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. చైతన్యం పేరుతో ఈ రోజు నుండి నవంబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మాలన కోసం వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే బుధవారం "చైతన్యం" పోస్టర్లను విడుదల చేసినట్లుగా పేర్కొన్నారు. ఈ నెల రోజుల పాటు జిల్లా పోలీసులు చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు కూడా భాగస్వాములై తమ వంతు భాద్యతగా సహకారం అందించాలని కోరారు. మత్తుకు బానిసలుగా మారిన యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని వారిలో చైతన్యం నింపేందుకే ప్రత్యేకంగా ఈ కార్యమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలోని గంజాయి హాట్స్పాట్స్ లో నిత్యం తనిఖీలు చేపట్టడం ఎవరైనా మత్తు పదార్థాలను సేవిస్తూ పట్టుబడితే వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం వాహన తనిఖీలు వంటి కార్యక్రమాలను ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా నిషేదిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ విక్రయిస్తున్నట్లు గానీ సేవిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే పోలీసు వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. చైతన్యం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ రైజింగ్ విజన్ సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనాలి

**భద్రాద్రి బ్యూరో, మహా:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వేలో జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న దశాబ్దాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం విద్య ఆరోగ్యం వ్యవసాయం పరిశ్రమలు ఐటీ పర్యావరణ పరిరక్షణ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ విజన్ -2047" డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ విజన్ పత్రం భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ప్రజల సూచనలు సలహాలు అభిప్రాయాలను సమగ్రంగా చేర్చే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ సర్వేను ప్రారంభించిందని, ఈ సర్వే అక్టోబర్ 10 నుండి ప్రారంభమై ఈ నెల 25 వరకు కొనసాగుతుందని కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రజలు ఉద్యోగులు విద్యార్థులు రైతులు ఎన్.ఆర్.ఐలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఈ సర్వేలో తప్పనిసరిగా పాల్గొని తమ విలువైన సూచనలు అందించాల్సిందిగా సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి వచ్చే ప్రజా అభిప్రాయాలు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు దిశానిర్దేశం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే అన్ని శాఖాధికారులు తమ కార్యాలయాలలో సర్వే లింక్ క్యూఆర్ కోడ్ ను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం అన్ని శాఖల ఉద్యోగులు ఈ సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈ సర్వేలో పాల్గొనేవారు https://www.telangana.gov.in/telan ఈ లింకు ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ కోరారు.




## కాంగ్రెస్ కోసం కష్టపడ్డ వారికే పదవులు

**భద్రాద్రి బ్యూరో, మహా:** కాంగ్రెస్ పార్టీ విస్తరణకు కృషి చేసి కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అభయమిచ్చారు. ఏఐసీసీ ఆదేశానుసారం, పిసిసి సూచనలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపిక దరఖాస్తుల స్వీకరణకు గురువారం కొత్తగూడెం క్లబ్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికలకు ముందు పని చేసిన వారిని గుర్తుంచుకుంటామని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు కలిసికట్టుగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కృషిని ఎప్పటికీ మరువబోమని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి అన్నారు. ఇదే ఐక్యతతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ముందుకెళదామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎంతో పారదర్శకంగా పదవులకు అర్హులను ఎంపిక చేస్తుందని చెప్పారు. డిసిసి అధ్యక్షుల ఎంపిక కోసం ఏఐసీసీ అబ్జర్వర్, ఎంపీ రఘురాం రెడ్డి సమక్షంలో పలువురు నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐసిసి అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం మాట్లాడుతూ.. గతంలో ఏ పార్టీ కూడా ఇలాంటి ఎంపిక ప్రక్రియ నిర్వహించలేదని, అర్హులకు పదవులు దక్కాలని కాంగ్రెస్ తొలి అడుగు వేసిందని అన్నారు. దరఖాస్తుల ఆధారంగా జాబితాను పిసిసికి అందజేస్తామని అనంతరం డిసిసి అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం, పీసీసీ అబ్జర్వేషన్ కార్యవర్గ సభ్యులతో, పార్టీ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్యలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకున్నాం

**భద్రాద్రి బ్యూరో, మహా:** ధాన్యం కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పేర్కొన్నారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ లతో కలిసి క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వానాకాలం ధాన్యం కొనుగోళ్లను పూర్తిస్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం కల్పించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, సుమారు 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగవచ్చని అంచనా వేశామని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి గదులు, తూకం యంత్రాలు, తడిపరీక్ష పరికరాలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా తరలించేందుకు రవాణా వసతులు, నిల్వ గోదాములు, మిల్లర్లతో సమన్వయం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపే చెల్లింపులు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ వానాకాలం కొనుగోళ్లు రైతులకు సౌకర్యవంతంగా, పారదర్శకంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారిని రుక్మిణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్‌తో మరింత సమాచారం

**భద్రాద్రి బ్యూరో, మహా:** విద్యార్థులకు ప్రజలకు అటు గ్రామస్తులకు మరింత సమాచారం క్షణాలు తెలుసుకోవాలంటే ప్రతి గ్రామంలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్కు అందుబాటులోకి తీసుకురావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్లో ఇండియన్ టెలికం సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.భాస్కర రావు బృందం కలెక్టర్ జితేష్ పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బిఎస్ఎన్ఎల్ నెట్వర్కు మరింతగా గ్రామాల్లోకి వెళ్లే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. మండలానికి పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నుకొని నెట్వర్క్ ను మరింతగా ప్రజల్లోకి వెళ్లే విధంగా కృషి చేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలను మరింత చేరువయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ప్రధానంగా యువత ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల కోసం ఎక్కడికో వెళ్ళకుండా చేతిలో మొబైల్ ఫోన్ నెట్వర్క్ ఉంటే దేశంలో జరిగే ప్రతి విషయాన్ని కరెంట్ అఫైర్స్ ను తెలుసుకునే అవకాశం ఉంటుందని తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. పంచాయితీలలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ను అందజేసి ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి వెళ్లే విధంగా తగు ఏర్పాటు చేయాలన్నారు. తొలుత కలెక్టర్ జితేష్ పాటిల్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటిఎస్ డైరెక్టర్ ఎం.అరవింద్, ఐ టి ఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.గణేష్ కుమార్, ఏటీఎం జి.సుభాష్, ఎస్ డి ఈ సక్రు, ఎంఆర్డివి శివరాంజి తదితరులు పాల్గొన్నారు.



# భారత ఖ్యాతిని చాటిన వ్యక్తి కలాం

## పాల్గొన్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు బుధవారం భారతదేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించి భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు అన్నారు. ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతమని, అందరికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మండల యూత్ అధ్యక్షులు సతీష్, మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్‌పై బీజేపీకి చిత్తశుద్ధి లేదు




**జూలూరుపాడు, మహా:** బీసీ రిజర్వేషన్ పెంపుపై బిజెపికి చిత్తశుద్ధి లేదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి వెంకట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని తెలిపారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన వచ్చినా, పార్లమెంట్‌లో చట్టం చేయకుండా మోడీ ప్రభుత్వం అడ్డుపడుతుందని తెలిపారు. జీఎస్టీ వ్యవస్థ ను కేంద్రం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రెగ్యులేటరీ బిల్లుతో దేశంలోని విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వాలని కేంద్రం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యాసా నరేష్, కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి, వలమల్ల చంద్రరావు, బోడ అభిమిత్ర, పార్టీ శాఖ కార్యదర్శి బొల్లి లక్ష్మయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలను కచ్చితంగా పాటించాలి



**ఖమ్మం, మహా:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలనిఅడిషనల్ డీసీపీ లా&అర్డర్ ప్రసాద్ రావు అన్నారు. బాణసంచా దుకాణాల కేటాయింపునకు బుధవారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లాటరీ పద్ధతిలో డ్రా తీసి ఒకొక్కరికి దుకాణాలు కేటాయించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. నిబంధనల మేరకునగరంలోని రెండు మైదానాల్లో 128 దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు జిల్లా అధికారులు అనుమతిచ్చారని, వీటిని ఎవరు అతిక్రమించవద్దని అన్నారు. డిగ్రీ కళాశాలలో 86, పెవిలియన్ మైదానంలో 42 ఏర్పాటు చేయాలని నిర్ణయించి డ్రా తీసినట్లు తెలిపారు. మొత్తం 148 మంది దరఖాస్తుదారుల్లో 128 దీపావళి బాణసంచా దుకాణాలు కేటాయించిన్నట్లు తెలిపారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

**ఖమ్మం, మహా:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ మరియు అదేవిధంగా షార్ట్ ఫిల్మ్ కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ (పోలీస్ ఫ్లాగ్ డే) పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహించబడుతాయని. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన (3) ఫోటోలు మరియు తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీలోపు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 x 8 సైజ్ ఫోటోలనుపెన్ డ్రైవ్లో సాఫ్ట్ కాపీ నిపోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పోలీస్ పి ఆర్ వో సెక్షన్ లో అందజేయాలన్నారు.

## మీడియా మిత్రులకు క్షమాపణ చెప్పాలి

**వైరా,మహా:** వైరా మున్సిపాలిటీకి వార్తల కవరేజ్ కోసం వెళ్లిన మీడియా మిత్రుల పట్ల గౌరవం లేకుండా నిర్లక్ష్యంగా మాట్లాడిన మున్సిపాలిటీ మేనేజర్ సుధాకర్ మీడియా మిత్రులకు క్షమాపణ చెప్పాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ యర్రబాబు మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ పెద్ద ఎత్తున ఇతరుల ఖాతాకు బదిలీ అయింది దానిపై వరంగల్ నుంచి ఆర్డిఎంఏ మసూద్ వచ్చారన్న విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు న్యూస్ కవరేజ్ కోసం అక్కడికి వెళ్తే వారిని కమిషనర్ కూర్చోమని చెప్పినప్పుడు కూర్చోడానికి పక్క రూమ్ కి వెళ్ళిన వారి పట్ల తోటి అధికారులతో బాధ్యత కలిగిన మున్సిపల్ మేనేజర్ అమర్యాదగా మాట్లాడే విధానం మంచి పద్ధతి కాదని సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ కు ఎంతో విలువ ఉందని అలాంటి వారి పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడి ఎవరు రమ్మన్నారు వారిని లోపలికి ఎందుకు కూర్చోబెట్టారు అని అనడం సరైన పద్ధతి కాదని వెంటనే మున్సిపల్ మేనేజర్ మీడియా పట్ల అమ్మర్యాదగా మాట్లాడటం మంచి పద్ధతి కాదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో. ఈ కార్యక్రమంలో గారపాటి అశోకు మోటకొండ బండారుపల్లి ముత్తయ్య కొత్త వెంకటయ్య మూటకొండ దొబ్బల కృష్ణయ్య మోదుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు





## వైరా మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు

**వైరా, మహా:** వైరా మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలతో తొలగించిన వారిని మరల విధుల్లోకి తీసుకోవడంతో వైరా మున్సిపాలిటీ అవినీతి మయంగా మారింది. గతంలో అవినీతిపై అప్పటి కమిషనర్ లు అవినీతికి పాల్పడుతూ మున్సిపల్ ఆదాయాన్ని గండి కొడుతున్న వారిని తొలగించడం జరిగింది. కొంతకాలంగా మరలా వారిని రకరకాల రూపంలో మునిసిపాలిటీ విధులలో కేటాయించ టంతో అవినీతికి అడ్డు కట్ట లేకుండా పోయింది. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు విషయంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి. ఈ అక్రమాల వెనక మున్సిపల్ అధికారుల ప్రమేయం ఉంది ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని తన ఇష్టారాజ్యంగా ట్రేడ్ లైసెన్సులకు తక్కువ ఫీజులు వసూలు చేస్తూ అసలు అవినీతి ఆరోపణలతో తొలగించిన వ్యక్తులను తీసుకోవటమే తప్పు. అవినీతితో ఆరోపణలు పక్కన పెట్టిన వ్యక్తులను కీలకమైన రెవెన్యూ బాధ్యతలు ఎలా గొప్ప చెపుతారు. ఇప్పటికే వైరా మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది కోట్ల రూపాయల డబ్బులు సొంత ఖాతాలలో మళ్లించుకున్నారు.

## రాష్ట్ర టాస్క్ ఫోర్స్ సభ్యురాలు డా. శశీశ్రీ ఆకస్మిక తనిఖీ



**ఖమ్మం, మహా:** రాష్ట్ర టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యురాలు, వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డా. కె. శశీశ్రీ బుధవారం ఖమ్మం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఎం. నరేందర్ ఆమెకు అన్ని వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, డ్రగ్ స్టోర్లు, పేషంట్ వార్డులను చూపిస్తూ వివరాలు అందించారు.తనిఖీ సమయంలో డా. శశీశ్రీ వైద్య సిబ్బంది హాజరు, పేషంట్ కేస్ షీట్లు, వార్డు రిజిస్టర్లు,రికార్డులను పూర్తిగా పరిశీలించారు. ప్రతి విభాగంలో అందించే వైద్య సేవల నాణ్యతపై విచారించి, అవసరమైన చోట తక్షణ సవరణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి



**నేలకొండపల్లి, మహా:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని బోదులబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. రోగులతో మాట్లాడారు... సేవలు గురించి వైద్య సిబ్బంది ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ‘ మాట్లాడారు... ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం రామచంద్రాపురం లో అంగన్వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హాజరు శాతం ను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎవరెస్ట్‌పై తెలంగాణ పతాకం ఎగరేయాలనే కల!



**ఖమ్మం సిటీ, మహా:** “ప్రపంచంలోనే ఎత్తైన శిఖరం మౌంట్ ఎవరెస్ట్‌పై తెలంగాణ పతాకం ఎగరేయాలనే కల నా హృదయంలో మిన్నంటుతోంది. కానీ ఆ కలను నెరవేర్చేందుకు ప్రజల చేయూత అవసరం” అని మౌంటెనీర్ మోతీ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం, సోమ్లా నాయక్ తండాకు చెందిన ఆయన పేద కుటుంబం నుంచి ఎదిగి, తన పట్టుదలతో ఇప్పటివరకు ఆఫ్రికాలోని మౌంట్ కిలిమాంజారో, రష్యాలోని మౌంట్ ఎల్బ్రూస్ పర్వతాలను అధిరోహించారు. తన తదుపరి గమ్యం ప్రపంచపు అగ్రశిఖరం – మౌంట్ ఎవరెస్ట్ అని తెలిపారు.

## పత్తి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టండి




**ఖమ్మం, మహా:** పత్తి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ ఏడాది మునుపెన్నడు లేని రీతిలో నష్టపోయారని తెలిపారు. రైతు సంఘం సమావేశం బుధవారం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ఈ ఏడాది అతివృష్టి కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎకరాకు క్వింటా, రెండు క్వింటాళ్లకు –మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. కనీస పెట్టుబడులు రావని వచ్చిన పత్తి కూడా వర్షాలు పడుతుండడంతో అంత నాణ్యతగా లేదని గోవిందరావు తెలిపారు. పత్తి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పరిహారాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలను సిసిఐ –ఆధ్వర్యంలో ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



**బోనకల్ మహా:** స్థానిక బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏ పీ జె అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఎన్ ఎస్ ఎస్ చైర్మన్ శ్రీమతి నిళిని శ్రీ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలతో సత్కరించడం జరిగింది. కలాం ని ఉద్దేశించి శ్రీమతి నళిని శ్రీ మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అక్టోబర్ 15 ,1931 వ తేదీన రామేశ్వరంలో జన్మించారు. ప్రముఖ భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్త మరియు రాజనీతిజ్ఞుడు 2002 నుండి 2007 వరకు భారతదేశ 11వ రాష్ట్రపతిగా పనిచేశారు. భారతదేశ అంతరిక్ష మరియు క్షిపణీ కార్యక్రమాలకు ఆయన చేసిన ఘన నియమైన కృషికి ఆయన విస్తృతంగా ప్రసిద్ధి చెందారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాట్లాడటం జరిగింది. ఎ. మోహన్, జి. జోనాతాన్ బాబు, ఎ. రాజేంద్ర కుమార్, పి.లక్ష్మీకాంతం, డి. పద్మావతి, రామకృష్ణ,యం. రమేష్, యస్. రాజేంద్ర, జి. ప్రీయ కుమార్ రెడ్డి, ఏ యూఎం కృష్ణ, యు డి సీ మదర్, అరుణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీల మనుగడకి కార్యకర్తలే పెద్ద పీఠ:ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని ఎం.ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో బుధవారం నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఎన్నికలకు సర్వత్ర సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం పెంపొందించాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు సూచించారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని,ప్రతి పథకం పేదవాడి అభివృద్ధికి ద్రోహదపడుతుందని,పథకాల ఉనికిని ప్రజలకు చేరవలసిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందని ఎమ్మెల్యే అన్నారు.పార్టీలు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి కార్యకర్తలదే పెద్ద ఎమ్మెల్యే అన్నారు.జిల్లా డిసిసి నూతన అధ్యక్షుల నియామకంలో నియోజకవర్గంలోని ఆశావాహులు తమ దరఖాస్తులను అందించాలని ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా మహేంద్రన్ వ్యవహరిస్తారని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, యువ కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగేందర్,జిల్లా డిసిసి అధ్యక్షులు పువల్ల దుర్గాప్రసాద్,పిసిసి జనరల్ సెక్రెటరీ నూతి సత్యనారాయణ, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు, నియోజకవర్గ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## పోస్టల్ ప్రమాద భీమా రెన్యువల్



**చింతకాని, మహా:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందికి కల్పించిన పోస్టల్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని 2025-26 సంవత్సరానికి గాను జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ఎంపీవో పర్వీన్ కైసర్ ఆదేశాల మేరకు నాగులవంచ గ్రామ పంచాయతీ కార్యదర్శి బుద్దే. చిరంజీవి సిబ్బందికి రెన్యువల్ చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద భీమా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం శుభ పరిణామంగా అభివర్ణించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి భహాటం.ఫణిరాజు మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను పోస్టల్ ప్రమాద భీమా ఇన్సూరెన్స్ రెన్యువల్ సౌకర్యం కల్పించిన కలెక్టర్ దురిశెట్టి అనుదీప్,జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ పర్వీన్ కైసర్ కు ధన్యవాదాలు తెలిపారు. జనరల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించాలని ఇది గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న చింతకాని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు

**చింతకాని, మహా:** చింతకాని మండలం నాగలవంచ గ్రామం ఆలస్యం బసవయ్య నాగమణి మాజీ సర్పంచ్ మనవడు కార్తీక్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో నూతన మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జొన్నలగడ్డ మల్లేశ్వరి రిటైర్డ్ గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు అంబటి శాంతయ్య . ముర్కుటి సుబ్బారావు వంకాయలపాటి సత్యం వంకలపాటి లచ్చయ్య ఆలశం బసవయ్య జొన్నలగడ్డ సందీప్ పాల్గొన్నారు



# ఫ్యాక్టరీ అభివృద్ధికి తోడ్పడి



**నేలకొండపల్లి, మహా:** మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు రైతులు ఫ్యాక్టరీ అభివృద్ధి కి తోడ్పాటు ను అందించి రైతులు అభివృద్ధి చెందాలని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ నామా కృష్ణయ్య పేర్కొన్నారు. మండలం లోని రాజేశ్వరపురం వద్ద నున్న ఫ్యాక్టరీలో తన చాంబర్ లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఈ ఏడాది సీజన్ లో చెరుకు టన్ను కు అన్ని రాయితీలు కలుపుకుని రూ.3758 లను అందించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.210 అదనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా అత్యధికంగా -చెరుకు సరఫరా చేసిన, అధునిక పద్ధతిలో చెరుకు సాగు చేసిన రైతులకు., ఎక్కువ చెరుకు ను సరఫరా చేసిన రైతులకు యాంత్రీకరణ పద్ధతి. ‘ ప్రదర్శనా క్షేత్రంలో సాగు చేసి అధిక దిగుబడి సాధించిన రైతులకు ప్రోత్సాహాలకు అందించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో క్రషింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు నూతన పద్ధతలు పాటించి దిగుబడి సాధించాలని కోరారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, కేన్ డీజీయం (ఫైనాన్స్) వెంకటేశ్వర్లు, కేన్ డీజీఎం అప్పారావు, హెచ్.ఆర్.నరేష్ పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు

# ఆర్యవైశ్యులకు అవకాశాలు కల్పించాలి

## చైర్మన్ పొద్దుటూరి నాగేశ్వరరావు



మణుగూరు, మహా : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశాలు కల్పించాలని జిల్లా ఆర్యవైశ్య జిల్లా కార్పొరేషన్ చైర్మన్ పొద్దుటూరి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లులను బుధవారం మర్యాదపూర్వకంగా మణుగూరులో కలిశారు. ఆర్యవైశ్య సమాజానికి నామినేటెడ్ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. సమాజ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఆర్యవైశ్యులకు కూడా తగిన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు కె విశ్వనాథ గుప్తా, చిత్తలూరు రమేష్ బాబు, కొత్తగుళ్ల రామచంద్రరావు, బండారు నరసింహారావు, సందీప్, శేషుబాబు, కత్తి రాము, మిట్టపల్లి శ్యామ్, సాయి, సముద్రాల సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పినపాక మండలం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 28 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల 20 వేల విలువగల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ గుమ్మడి వినీత, ఏపిఓ వీరభద్రస్వామి, కాంగ్రెస్ నేతలు రామనాథం, కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకట్రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అర్జున్, శ్రీను, సమ్మయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నివాసాల మధ్య బాణాసంచాల దుకాణాలకు అనుమతులు ఇవ్వోద్దు



నేలకొండపల్లి, మహా: దీపావళి బాణా సంచాల దుకాణాలను నివాసాల మధ్య అనుమతులు ఇవ్వోద్దని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ అధికారులకు వినతి పత్రాలను అందించారు. బుధవారం స్థానిక తహశీల్దార్, అగ్నిమాపక శాఖ, పోలీసులకు వినతి పత్రాలను అందించారు. స్థానిక వాసవి భవన్ నివాసాల మధ్య ఉండటం వలన అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. నివాసాల తో పాటు, వివిధ ప్రభుత్వ శాఖ కార్యాలయాలు ఉన్నట్లు తెలిపారు. బాణా సంచాల వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి

ఖమ్మం,మహా: క్రొత్తగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయడంతో పాటు, ఉన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో రోడ్ల నిర్వహణపై రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల వర్షాలకు రహదారులు చాలా చోట్ల దెబ్బతిన్నాయని అన్నారు. దెబ్బతిన్న రోడ్ల గుంతలు, చిన్న చిన్న మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా ప్రవేశం వద్ద నలువైపులా జిల్లాకు సంబంధించి నామ బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రం ప్రవేశం వద్ద రోడ్లు దెబ్బతిని ఉన్నాయని, నగర పరిధిలోని రోడ్ల నిర్వహణ నగరపాలక సంస్థ చేపడుతుండగా, ప్రారంభం వద్ద సంబంధిత శాఖలు రోడ్ల నిర్వహణ చేయాలని కలెక్టర్ అన్నారు. నగర ప్రవేశం వద్ద గ్రీనరీతో సుందరీకరణ పనులు చేయాలని అన్నారు. జిల్లాలో రోడ్ల విస్తరణ, మరమ్మత్తులు, నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్ వివరాలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అనుమతికి సమర్పించిన ప్రతిపాదనల స్థితిని తెలుసుకొని, అనుమతి పొందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రహదారి భద్రత అధికారులుగా మనపై ఉందని కలెక్టర్ అన్నారు. బైపాస్ బ్రిడ్జి వెడల్పుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అల్లిపురం, వెలుగుమట్ల తదితర ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాల తరలింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

## పాలేరులో 53 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం



నేలకొండపల్లి, మహా: పాలేరు లో మొత్తం 53 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.సతీష్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో బుధవారం కొనుగోలు కేంద్రాల పై సమీక్ష సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ఈ నెల 25 నుంచి డివిజన్ లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి మండలం లో 22 కేంద్రాలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గన్నీ సంచులు, టార్పాలిన్ లు సిద్ధం ఉంచాలని సూచించారు. కాంటాలలో ఎలాంటి తప్పిదాలు లేకుండా ఉండేందుకు ఏంట్రీ ఆర్డర్ ప్రకారం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిబంధనల మేరకే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో లు దుర్గాభవాని, ఈశ్వరి, శిరిష, అరవింద్, అవినాష్, సొసైటి సీఈవో లు, గ్రామ దీపికలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



మణుగూరు, మహా : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు, యువతి యువకులకు అందించే వృత్తి విద్య శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని పర్సనల్ సలగల రమేష్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సేవ సమితి ఆధ్వర్యంలో టైలరింగ్, కంప్యూటర్ డిటిపి, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్ జ్యూట్ బ్యాగుల తయారీ బంజారా బ్యాగుల తయారీ ఫోటోషాప్ మల్టీమీడియా కోర్సులలో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు మహిళలు ఈనెల 30వ తేదీ లోపు ఏరియా జిఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్మెంట్ విభాగంలో తమ దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. అదేవిధంగా ఈ కోర్సులకు శిక్షణను ఇచ్చేందుకు నైపుణ్యం కలిగిన నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేయాలని, ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఖమ్మం మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ పర్యటన



ఖమ్మం, మహా: ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య బుధవారం నగరంలోని ఇల్లందు క్రాస్ రోడ్, బల్లెపల్లి రోడ్, జెడ్పీ సెంటర్, బోనకల్ క్రాస్ రోడ్, శ్రీనివాస నగర్ ప్రాంతాల్లో శానిటేషన్ పనులను పరిశీలించారు. బల్లెపల్లి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని సందర్శించి, ప్రహరీ గోడ నిర్మాణం, పెయింటింగ్ పనులను పరిశీలించారు. అలాగే ఇల్లందు క్రాస్ రోడ్, బోనకల్ క్రాస్ రోడ్, శ్రీనివాస నగర్ ఫ్లైఓవర్ వద్ద శానిటేషన్ పరిస్థితులను సమీక్షించి, చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు, డిబ్రిస్ లేకుండా శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రతి ప్రాంతం శుభ్రంగా, సుందరంగా ఉండేలా ప్రతిరోజూ శానిటేషన్ ప్లాన్ ప్రకారం పనులు చేయాలని కమిషనర్ సూచించారు.

## లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు



ఖమ్మం,మహా: పారదర్శకంగా ఆన్ లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయింపు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కల్లూరు డివిజన్ పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కంప్యూటర్ ర్యాండ మైజేషన్ ద్వారా అలాట్ చేసి జిల్లా రెవెన్యూ అధికారిణి మాట్లాడుతూ, డబల్ బెడ్ రూం అలాట్ మెంట్ వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. కల్లూరు డివిజన్ పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామంలో నిర్మించిన 40 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గతంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశామని, ప్రస్తుతం ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు జరుగుతుందని, ఏ లబ్ధిదారుడికి ఏ నెంబర్ ఇండ్లు కేటాయించాలనే అంశం పూర్తి పారదర్శకంగా ఎటువంటి పైరవీలు లేకుండా ఆన్ లైన్ ద్వారా కేటాయించామని అన్నారు.

# భర్త మోసం చేశాడంటూ భార్య నిరసన



**వైరా, మహా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో భర్త మోసం చేశాడంటూ భార్య భర్త ఇంటి ఎదుట నిరసన చేపట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే, తాటిపూడి గ్రామానికి చెందిన బండారుపల్లి సురేష్ అనే యువకుడు రమణ అనే మహిళను ప్రేమించి రెండు సంవత్సరాల క్రితం దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లి తర్వాత సురేష్ తనను ఇంటికి తీసుకెళ్లకపోగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని రమణ ఆరోపించింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ "సురేష్ గత ఆరు సంవత్సరాలుగా నన్ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కానీ ఇప్పుడు తల్లాడ మండలం నారాయణపురం గ్రామం ఎరుకల కాలనీలో తన ఇంట్లోనే ఉంచి వారానికి ఒకసారి మాత్రమే వస్తున్నాడు. వచ్చినప్పుడల్లా మద్యం సేవించి తిట్టిపోస్తూ కొడుతుంటాడు" అని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వైరా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రమణ తన భర్త సురేష్‌పై వైరా పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసింది. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# క్యూ లైన్‌లో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



**పాల్వంచ,మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో సాధారణ ప్రజలతోపాటు క్యూలో నిలబడి తన కంటి పరీక్షలు చేయించుకున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మరోసారి తన నిరాడంబరతను చాటుకున్నారు.
ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేసినా, ఆయన జీవనశైలి మాత్రం ఇప్పటికీ సాధారణంగానే కొనసాగుతోంది. సైకిల్‌పై తిరగడం, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం గుమ్మడి నర్సయ్యకు అలవాటే. ఈ క్రమంలోనే కంటి పరీక్షల కోసం ఆయన ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి చేరుకొని, సాధారణ రోగిలా ఓపీ చీటీ తీసుకొని తన వంతు కోసం క్యూలో నిలబడి పరీక్ష చేయించుకున్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శివ



**మణుగూరు, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్–14 కబడ్డీ బాలుర ఎంపిక పోటీలు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో 14వ తేదీన నిర్వహించారు. ఈ ఎంపికల్లో మణుగూరు మహాత్మ జ్యోతి పూలే హైస్కూల్ విద్యార్థి అల్లం శివ అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 16, 17, 18 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్నాయి. శివ తన అద్భుత ప్రతిభతో సాధించిన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ రజనీ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సీఓ రాంబాబు, డీసీఓ బ్యూలా రాణి, వ్యాయామ ఉపాధ్యాయులు ముంజాల సురేష్, పీడీ పీ వెంకట్రావు, ఏటీపీ మంద శంకర్, అధ్యాపక బృందం అల్లం శివకు బుధవారం అభినందనలు తెలిపారు. విద్యార్థి కృషి, క్రీడా పట్ల చూపిన నిబద్ధత పాఠశాలకు గర్వకారణమని సందర్భంగా ప్రిన్సిపాల్ రజనీ పేర్కొన్నారు.

# బూర్గంపాడు మాణిక్యం సృజన



**బూర్గంపహాడ్ మహా:** కృషి.... పట్టుదల... అంకిత భావం ఉంటే...ఏ రంగంలోనైనా రాణించవచ్చు అంటూ నిరూ పించింది మండల కేంద్రమైన బూర్గంపాడులోని ఎస్సీ కాలనీకి చెందిన మేక సృజన... ఫుట్ బాల్ రాష్ట్ర మహిళా జట్టుకు మేకా సృజన ఎం పిక అయ్యింది..మండల కేంద్రంలోని ఎస్సీ కాల నీకి చెందిన మేక పున్నం, పద్మల కుమార్తె మేక సృజన చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని పట్టుదలతో మోరం పల్లి బంజర లోని ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకొంది. ఐదవ తరగ తి పాల్వంచ రెసిడెన్షియల్ సోషల్ వెల్ఫేర్ పాఠ శాలలో సీటు రావడంతో అక్కడ తన చదువు ను ప్రారంభించింది. అక్కడి గురువుల ప్రోత్సా హంతో చదువుతోపాటు ఆటల్లోనూ మంచి ప్రతిభ చాటడంతో ఆమెను స్పోర్ట్స్ పాఠశాల పోటీ పరీక్షకు సెలెక్ట్ చేయడంతో మెదక్ జిల్లా స్పోర్ట్స్ అకాడమీలో ఏడవ తరగతిలో ఆమెకు సీటు రావడంతో అక్కడే తన చదువును కొన సాగించింది.స్పోర్ట్స్ లో మరింతగా రాణిస్తూ ముఖ్యంగా ఫుట్ బాల్ క్రీడలో తన గురువు ప్రకాష్ తోడ్పాటును అందించడంతో రాష్ట్రస్థా యి అండర్– 19 ఫుట్ బాల్ జట్టులో స్థానం సంపాదించగలిగానని సృజన తెలిపారు.

## వికలాంగులకు అండగా
# వైరా ఎస్ఐ



**వైరా, మహా:** వైరా పోలీస్ స్టేషన్‌కు ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న పుష్పాల రామారావు తన సేవా ధర్మంతో ప్రజల మనసులు గెలుచుకుంటున్నారు. పోలీస్ వృత్తిలోని ఒత్తిడి, కేసుల భారం మధ్యలో కూడా ఆయన మానవతా దృక్పథంతో వికలాంగుల పట్ల ప్రత్యేకమైన సహాయం అందిస్తున్నారు. వైరా మండల పరిధిలో శాంతినగర్లో ఉన్న వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు అందజేయడం, వారి కుటుంబాల జీవనోపాధికి తోడ్పడే విధంగా సహాయం చేయడం వంటి పనులు ఎస్సై రామారావు తరచూ చేస్తున్నారు. ఆయనను చూసి ప్రజలు "పోలీసు అధికారి మాత్రమే కాదు, మన కుటుంబ సభ్యుడే" అని అభినందిస్తున్నారు. వృత్తిపరంగా కఠినంగా ఉండే పోలీసు ఉద్యోగంలోనూ ఇంత మానవత్వం చూపడం అరుదని వైరా ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎస్సై పుష్పాల రామారావు సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది.

# బహుముఖ విస్తరణతోనే సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్







**భద్రాద్రి బ్యూరో, మహా:** బహుముఖ విస్తరణతోనే సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్ ఉందని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం పేర్కొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తులో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 100 మిలియన్ టన్నుల దిశగా పయనించటానికి భవిష్యత్ ప్రణాళికపై చర్యలను తీసుకోవటానికి సంస్థ ఆదేశాల ప్రకారం సిపిపి హెచ్ఆర్‌డి డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో కార్పొరేట్ పరిధిలోని జనరల్ మేనేజర్లతో సింగరేణి సంస్థ డైరెక్టర్లు పదవీవిరమణ పొందిన డైరక్టర్లచే కొత్తగూడెం ఇల్లందు క్లబ్ నందు బుధవారం జిఎం (సిపిపి) ఏ.మనోహర్ అధ్యక్షతన ఒక్క రోజు మేథోమథన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సింగరేణి సంస్థ ప్రస్తుతం బొగ్గు రంగంలో ఉన్న పోటీని తట్టుకుని భవిష్యత్తులో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడానికి బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాకుండా సింగరేణి సంస్థని ఇతర రంగాలలోకి విస్తరించటానికి పదవీ విరమణ పొందిన డైరెక్టర్ల జనరల్ మేనేజర్ల అనుభవాలు సలహాలు ఎంతో ముఖ్యం అని కావున కంపనీ అభివృద్ధికి తమ అమూల్యమైన సలహాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమములో సింగరేణి డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ సింగరేణి సంస్థలో గల భూగర్భ, ఉపరితల గనులలో బొగ్గు ఉత్పత్తి గురించి, థర్మల్ సౌర విధ్యుత్ ఉత్పత్తి సింగరేణి భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్థ డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పి అండ్ పి)కే.వెంకటేశ్వర్లు, డైరక్టర్(పా)గౌతమ్ పోట్రు, డైరక్టర్(ఈ అండ్ఎం)ఎం.తిరుమలరావు, అడ్వైసర్ మినిస్ట్రీ ఆఫ్ కోల్ బి.వీరా రెడ్డి, రిటైర్డ్ డైరక్టర్లు డి.ఎల్.ఆర్.ప్రసాద్, బి.రమేష్ కుమార్, ఏ.మనోహర్ రావు, ఏ.భాస్కర్ రావు, వి.బాల కోటి రెడ్డి, రిటైర్డ్ జనరల్ మేనేజర్లు బి.సికే రెడ్డి, కే.గురవయ్య, కే.వి.సీతారామ రావు, జిఎం(సిపిపి) ఏ.మనోహర్, డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.



# పరారీలో కాపర్ వైర్ దొంగలు

**జూలూరుపాడు, (మహా):** 2010వ సంవత్సరంలో మండలంలోని పలు గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లోని కాపర్ వైరును దొంగిలిస్తున్నారని అప్పటి ఏఈ కడియాల కృష్ణార్జునరావు ఫిర్యాదు పై అప్పటి ఎస్ హెచ్ ఓ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కొత్తగూడెం అశోక్ నగర్ కాలనీకి చెందిన తమ్మయ్య నాయుడు, శ్రీరామ్ అను ఇద్దరు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. అనంతరం బేలు పై బయటకు వచ్చి కోర్టు నిబంధనలు ఉల్లంఘించి వాయిదాలకు హాజరుకా కుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ క్రమంలో తమ్మయ్య నాయుడు, శ్రీరాం పై కొత్తగూడెం అదనపు జే ఎఫ్ సి ఎం కోర్టు సెక్షన్ 82, 83 సిఆర్పిసి ప్రకారం నోటీసులు జారీ చేయడం జరిగింది. వీరి గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే 8712682041 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై బాదావత్ రవి ఒక ప్రకటనలో కోరారు.

# కామారెడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఖమ్మం క్రైమ్, మహా:** కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగు రు దుర్మరణం పాలయ్యారు. రాంగ్ రూట్‌లో వచ్చిన టిప్పర్ లారీ, ఎలక్ట్రిక్ స్కూటీని ఢీకొట్టడం తో ఈ విషాదం చోటుచేసుకుంది. స్కూటీపై ఇద్దరు చిన్నారులతో కలిసి తల్లి, తాత ప్రయా ణిస్తుండగా ప్రమాదం జరిగింది. ఘటన స్థలంలో నే ఆరేళ్ల బాలుడు, తల్లి మృతి చెందగా, తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించిన తాత, మరో చిన్నారి చికిత్స పొందుతూ మరణించారు. మృతులు కిషన్ (53), జస్లిన్ (29), జోయల్ ప్రకాష్ (4), జోయల్ జడ్సన్ (5 నెలలు)గా గుర్తించారు. కిషన్ అదిలాబాద్ జిల్లా వాసి కాగా, జస్లిన్-ఇద్దరు




చిన్నారులు ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందినవారని పోలీసు లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బిక్కనూర్ పోలీసులు పేర్కొన్నారు. స్థానికులు టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.

## జాతీయ స్కేటింగ్‌కు స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని



**ఖమ్మం సిటీ, మహా:** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థిని పసుపులేటి వీక్ష జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికై జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేసింది. పాఠశాల చిన్నారి వీక్ష హైదరాబాదులో నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ 2025 రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో రెండు విభాగాలలో పతకాలను సొంతం చేసుకుంది. 400 మీటర్ల రోలర్ స్కేటింగ్ లో సిల్వర్ మెడల్, మరో విభాగం 600 మీటర్ల స్కేటింగ్లో మరో సిల్వర్ మెడల్ ను సాధించి డిసెంబర్ లో జరిగే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలలో 600 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్ ను, 400 మీటర్ల స్కేటింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ ను సాధించింది. పలు విభాగాలలో రోలర్ స్కేటింగ్ లో వరుసగా పతకాల పంట పండించిన చిన్నారి పసుపులేటి వీక్షను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, సాంప్రదాయ అంశాలలో ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. అందువలన పాఠశాల చిన్నారులు వివిధ జాతీయ,రాష్ట్ర ,జిల్లా స్థాయి పోటీలలో నైపుణ్యాలను ప్రదర్శించి బహుమతులను పొందుతున్నారని తెలిపారు. చిన్నారి పసుపులేటి వీక్ష జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలియజేశారు. పసుపులేటి వీక్ష ను పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు అభినందించారు.

## ఘనంగా నరేశ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**తిరుమలాయపాలెం,మహా:** కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,బీరోలు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్ రెడ్డి జన్మదినం వేడుకలు మండలంలోని సుబ్లేడు గ్రామంలో బుధవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమానుల సమక్షంలో ఏర్పాటు చేసిన కేక్ ను నరేశ్ రెడ్డి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలు వురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తలసేమియా,సికేల్ సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు,నరేశ్ రెడ్డి అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, నాయకులు ఉన్నం రాజశేఖర్,బోడ మంగీలాల్,మందడి ఇజ్రాయిల్,సుమన్ రెడ్డి,పోట్ల కిరణ్,ఎల్. శ్రీనివాస్, వార వెంకటేశ్వర్లు,రంగా,సైదులు, సీతారాం నాయక్, సోమా శ్రీనివాస రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## నెట్ జీరో కంపెనీగా మారే దిశగా సింగరేణి కంపెనీ




**సత్తుపల్లి: మహా:** ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పూర్తి చేస్తామని, సింగరేణి సత్తుపల్లి అభివృద్ధి పనుల నిమిత్తం రూ.247. కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసిందని సంస్థ జనరల్ మేనేజర్ షాలెం రాజు అన్నారు.బుధవారం సత్తుపల్లి సింగరేణి గెస్ట్ హౌస్ లో సింగరేణి అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉత్పత్తి వివరాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 156.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు 75.71 లక్షల టన్నుల వెలికితీత జరగిందని తెలిపారు.869 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 391 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసినట్లు చెప్పారు. సింగరేణి కంపెనీ భవిష్యత్‌లో నెట్ జీరో కంపెనీగా మారే దిశగా పలు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం సోలార్ పవర్ జనరేషన్ పై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.ప్రతి సంవత్సరం సింగరేణి సుమారు 700. మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం చేస్తోందని,దానిని తగ్గించడానికి సోలార్ పవర్ వినియోగం పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కంపెనీ 300 మెగావాట్ల పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసిందని,కొత్తగూడెం ఏరియా పరిధిలోనీ 102 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కృషి జరుగుతోందని తెలిపారు.రాజస్థాన్ ప్రభుత్వం తో చర్చలు జరిపి అక్కడ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని తెలిపారు.అదనంగా సింగరేణి ఓపెన్ కాస్ట్ ఏరియాలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొన్నారు.సత్తుపల్లి ప్రాంతంలో ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించామని వాటి ప్రక్రియ ప్రారంభించి విలువ ఆధారంగా ఇతర కంపెనీలకు అందించనున్నట్లు వివరించారు.స్థ అభివృద్ధి కార్యక్రమాలపై జనరల్ మేనేజర్ శాలెం రాజు మాట్లాడుతూ ఈ ఏడాది 26 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని,డి.ఎం.ఎఫ్.టి నిధుల ద్వారా ఇప్పటి వరకు 247 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఈ నిధులను మరింత పెంచే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు.

## యుద్ధప్రాతిపదికన మరమ్మత్తు పనులు పూర్తిచేయండి

**మహా:** పట్టణ గ్రామీణ రహదారులు అంతర్గత రోడ్ల నిర్వహణ పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని ప్రజలు ప్రయాణికులు వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే నిర్లక్ష్యాన్ని సహించబోనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని ముర్రేడు బ్రిడ్జి రోడ్డులో జరుగుతున్న మరమ్మత్తు పనులను బుధవారం మున్సిపల్, ఆర్ అండ్ బి, పొలిసు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రోడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి అక్రమాలవల్లే ప్రజలకు ఈ దుస్థితి ఏర్పడుతోందని నిర్మాణాల్లో నాణ్యత లోపించి అనతికాలంలోనే రోడ్లు ధ్వంసమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు ఇతర అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్మించాలని ఎలాంటి నాణ్యత లోపించినా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల విషయంలో రాజకీయాలు తగవని సమస్య ఉంటే బాధ్యతగల పౌరులుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోస్టాఫీసు సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు, సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి, అదేవిధంగా సింగరేణి మెయిన్ స్టోర్స్ వరకు మూడు రోడ్లను యుద్ధ ప్రాతిపదికనే పునర్నిర్మాణ పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు.

## ఎర్రబోడులో కాంగ్రెస్ క్యాకర్త మృతి



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలంలో ఎర్రబోడులో కాంగ్రెస్ కార్యకర్త భూక్యా లాలు(53) బుధవారం మృతి చెందాడు. కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్న లాలు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహాన్ని కాంగ్రెస్ నాయకులు దమ్మాలపాటి ప్రసాద్, మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణలు సందర్శించి కాంగ్రెస్ పతాకాన్ని ఉంచి నివాళ్లు అర్పించారు. పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా పార్టీని అంటి పెట్టుకోని పని చేసిన నికార్సైన కార్యకర్త లాలు అని వారు కొనియాడారు.

## కారేపల్లి కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి

**కారేపల్లి, మహా :** కారేపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఘనంగానిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ సుధారాణి, శ్రీనివాసు, శేష ప్రసాద్‌లు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త అవిష్కరణలకు మార్గం చూపారని కొనియాడారు. కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అంటూ అబ్దుల్ కలాం నేటి యువతలో స్ఫూర్తి నింపారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత దేశానికి సరి కొత్త అవిష్కరణలకు పూనుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు దుర్గాప్రసాద్, యాకయ్య, వనిత, పాష తదితరులు పాల్గొన్నారు.